# శ్రీ విజ్ఞాన్ స్కూల్ నిర్లక్ష్యానికి ప్రాణం బలి..?

- స్కూల్‌లో మధ్యాహ్నం 10 తరగతి క్లాసులు
- విద్యార్థుల సంరక్షణపై నిర్లక్ష్యం
- రేగులగండి చెరువులో ఈతకు వెళ్లి 9వ తరగతి విద్యార్థి మృతి
- శోకసముద్రంలో మృతుడి కుటుంబసభ్యులు
- శ్రీవిజ్ఞాన్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్






**దశ, మణుగూరు :** విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి వారిని సంరక్షించాల్సిన స్కూల్ యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించడం మూలంగా ఓ విద్యార్థి నిండుప్రాణం బలైన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరులో గల శ్రీవిజ్ఞాన్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అదనంగా గతకొన్ని రోజుల నుండి 10వ తరగతి పాఠాలు చెప్తున్నారు. అందులో భాగంగా ప్రతిరోజు ఒంటిపూట బడులు ఐపోయిన తర్వాత ప్రత్యేకంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులకు పదవ తరగతి పాఠాలు చెప్తున్నారు.

ఈ క్రమంలో శనివారం కూడా ప్రత్యేక క్లాసులు పేరుతో శ్రీవిజ్ఞాన్ స్కూల్‌లోనే ఉండిపోయారు. అందులో ముగ్గురు విద్యార్థులు అక్కడ నుండి రేగులగండి చెరువు వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈతకు వెళ్లిన ముగ్గురులో ఆదరశ్‌నగర్‌కు చెందిన హర్షవర్ధన్ అనే విద్యార్థి చెరువులో మునిగిపోయాడు. రోజులాగానే స్కూల్ నుండి ఇంటికి వస్తాడని ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు స్థానిక మణుగూరు పోలీస్టేషన్ నుండి మీ అబ్బాయి ఈతకు గల్లంతు అయ్యాడనే సమాచారం అందింది. వెంటనే భయంతో తల్లిదండ్రులు శ్రీవిజ్ఞాన్ స్కూల్‌కు ఫోన్ చేయగా ఎవరు స్పందించలేదు. స్కూల్‌కు సంబంధించిన ఇతరులు కూడా కనీసం ఫోన్‌లో కూడా స్పందించకపోవడం గమనార్హం. దీంతో ఆందోళనతో విద్యార్థి తల్లిదండ్రులు చెరువు వద్దకు చేరారు. శనివారం రాత్రి సమయంలో విద్యార్థి తండ్రి మణుగూరుల పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. 24 గంటలు గడిచిన అనంతరం ఆ విద్యార్థి మృతదేహం చెరువులో దొరికింది.

**ఫిట్‌నెస్ లేని బస్సులు- మణుగూరులో గల శ్రీ విజ్ఞాన్ స్కూల్ బస్సులు నిర్వాణ సరిగ్గా లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. శనివారం ఉదయం కూడా ఆ స్కూల్‌కు చెందిన బస్సు రాజీవ్‌గాంధీనగర్‌లో ఆగిపోయి రిపేర్‌కు రావడంతో ఆ బస్సును అదే వీధిలో ఎవరికి కనపడకుండా ఉంచడం కూడా స్కూల్ బస్సుల నిర్వాహణ ఏ మేరకు ఉందనేది అర్థమవుతుందని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై మణుగూరు సీఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.**




**విద్యార్థులపై అశ్రద్ధతోనే నిండుప్రాణం బలి**

స్కూల్‌లో చదివే విద్యార్థులు వారివారి ఇళ్లకు చేరారా లేదా అనే జాగ్రత్తలు శ్రీ విజ్ఞాన్ స్కూల్ యాజమాన్యం తీసుకొకపోవడం మూలంగానే ఓ పసి విద్యార్థి ప్రణం బలైందని మణుగూరు పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కూల్‌లో అదనపు తరగతులు నిర్వహించడమే పెద్ద తప్పు కాగా అందులో స్కూల్‌కు హాజరైన విద్యార్థులు ఎవరి బస్సుల్లో వారు వారి ఇంటికి చేరారా లేక ఇతర ప్రాంతాల్లో దిగారా అనే కనీస పట్టింపు లేకపోవడంలో ఈ భారీ ప్రమాదణ జరిగిందని విద్యార్థి సంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు అంటున్నారు.

## శ్రీవిజ్ఞాన్ స్కూల్ పై వెంటనే చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తన సొంత రాజ్యంగంతో స్కూల్ నడుపుతూ 9వ తరగతి విద్యార్థి ప్రాణం పోవడానికి శ్రీ విజ్ఞాన్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని వెంటనే ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక మిటీ వేసి పూర్తిస్థాయిలో విచారణ జరిపి స్కూల్ అనుమతులు రద్దు చేయాలన్నారు. వేసవి సెలవుల్లో ఇంకా స్కూల్‌లో పరీక్షలు నిర్వహిండం, అదనపు తరగతులు నిర్వహించడం చట్టపరంగా తప్పని అధికారులు కూడా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. అదృష్టం బాగుండి మిగిలిన ఇద్దరు విద్యార్థులు ప్రాణాలతో బయటపడ్డారని, లేకపోతే భారీ ప్రమాదం జరిగేదన్నారు. అదేవిధంగా శ్రీ విజ్ఞాన్ స్కూల్ బస్సుల నిర్వాహణ కూడా సరిగ్గాలేదని దానిపై కూడా సంబంధిత అధికారులను చర్యలు తీసుకోవాలన్నారు.

**- మునిగెల ప్రశాంత్,**
**జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌యూ జిల్లా కమిటీ.**

---

## ఆటో యూనియన్ నూతన కమిటి ఎన్నిక

- *జానంపేట అధ్యక్షునిగా తోగటి కుమార్*



**దశ, పినపాక :** పినపాక మండలంలోని జానంపేట నాగులమ్మ గుడి సన్నిధిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆటో యూనియన్ నూతన కమిటి ఎన్నిక నిర్వహించగా తోగటి కుమార్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. మాట్లాడుతూ జానంపేటలో ఆటో యూనియన్ పాత కమిటీ కాలపరిమితి ముగిసినందున ఎన్నికల్లో నూతన కార్యవర్గంను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని, కిరాయిలు దొరకక ఆటోలు అమ్ముకుంటూ రోజు కూలికి పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కావుల రమేష్, కార్యదర్శి వట్టం నాగరాజు, జాయింట్ కార్యదర్శి పూణెం కళ్యాణ్, ప్రచార కార్యదర్శి ఎస్కె రహీం, సతీష్ , కోర్స రాము, సుతారపు మున్న, గౌరవ అధ్యక్షులు అక్కిరెడ్డి శంకర్, గుండం దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## కవితక్క రాజకీయ ప్రస్థానం దిగ్విజయం కావాలని ప్రత్యేక పూజలు



**దశ, రంగారెడ్డి :** తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, తెలంగాణ ఆడబిడ్డ కవితక్క గారు ఈనెల 25వ తేదీన మేడ్చల్ వేదికగా ప్రకటించబోయే నూతన రాజకీయ పార్టీ ప్రజల ఆశీస్సులతో ప్రజాదరణ పొందాలని కోరుతూ, శ్రీశైలానికి ఉత్తర ద్వారంగా భాసించే ప్రసిద్ధ శైవక్షేత్రం నాగర్‌కర్నూల్ జిల్లా నలమల్ల పర్వతశ్రేణులలో ని ఉమా మహేశ్వరంలో ఆదివారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, రంగారెడ్డి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారిని దర్శించుకుని, కవితక్క గారు చేపట్టబోయే ఈ చారిత్రాత్మక నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో నవ శకానికి నాంది పలకాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని విశ్వవ్యాప్తం చేసిన కవితక్క గారు, ఇప్పుడు ప్రజల పక్షాన పోరాడేందుకు రాజకీయాల్లోకి రావడం హర్షించదగ్గ పరిణామం. అమె అడుగులు ప్రజల కోసం అమే ఆరాటం ప్రజాసేవ కోసం అమే ఆశయం రాష్ట్ర అభివృద్ధి కొసం అని వారు అన్నారు ఈనెల 25న మేడ్చల్ లోని శ్రీ అద్వయ కన్వెన్షన్ (మునీరాబాద్) వేదికగా జరగబోయే పార్టీ ప్రకటన ఒక చారిత్రక ఘట్టం కాబోతోంది. ఈ నూతన పార్టీకి ప్రజల మద్దతు మెండుగా ఉండాలని, రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ పార్టీ ముందుకు సాగాలని వారు వేడుకున్నారు.

## మేడారం వనదేవతలను దర్శించుకున్న పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు దంపతులు



**దశ, మేడారం :** పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సతీసమేతంగా ఆదివారం మేడారం లో వనదేవతలైన సమ్మక్క సారక్కలను దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు. శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఆయన సతీమణి పాయం ప్రమీల మేడారంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వనదేవతులు ఆశీర్వాదం పొందారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తన ఎత్తుబంగారం అమ్మవార్లకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబసభ్యలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అజ్ఞాత వాసానికి వెళ్లిన శ్రీవిజ్ఞాన్ కరస్పాండెంట్ సాంబశివరెడ్డి

- *విద్యార్థి మృతికి కారణాలు తెలియపరచాలి*
- *ఎస్ఎఫ్ఐ మణుగూరు కమిటీ డిమాండ్*



**దశ, మణుగూరు :-** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మృతుడు 9వ తరగతి విద్యార్థి నక్క హర్షవర్ధన్ మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మణుగూరు డివిజన్ కన్వీనర్ మాదాసి అఖిల్ మాట్లాడుతూ విద్యార్థి మృతి పట్ల తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చెందుతున్నారని స్కూల్ యాజమాన్యం మాత్రం స్పందించకపోవడం విచారకరమని విద్యార్థి మృతికి స్కూల్ యాజమాన్యం బాధ్యతారాహిత్యం కనపడుతుందని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి మాదాసి అఖిల్ పేర్కొన్నారు. స్కూల్ యాజమాన్యం స్పందించి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్కూలు ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నీరజ్ మనోజ్, తేజహర్ష పాల్గొన్నారు.

---

## గడ్డి అన్నారం ఏఎంసీలో రాజకీయ రగడ... మాజీ చైర్మన్‌పై తీవ్ర ఆరోపణలు

- *"8 కోట్ల అవినీతి... ఇప్పటికీ మోసం" – రామ్ నర్సయ్యపై భాస్కర్ చారి ఫైర్.*
- *చైర్మన్‌పై విమర్శలు చేస్తే సహించం...*
- *ఏఎంసీ నుంచి కఠిన హెచ్చరిక.*
- *అవినీతి ఆరోపణలతో మళ్లీ హాట్ టాపిక్‌గా గడ్డి అన్నారం మార్కెట్*
- *మాజీ చైర్మన్‌కు వార్నింగ్... "మళ్లీ మాట్లాడితే కఠిన చర్యలు".*
- *బాటసింగారం సమావేశంలో ఏఎంసీ పాలకవర్గం ఫైర్.*



**దశ, రంగారెడ్డి :** గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీలో రాజకీయ వాగ్వాదం మరింత తీవ్రతరమైంది. మాజీ చైర్మన్ రామ్ నర్సయ్యపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, ప్రస్తుత పాలకవర్గం బహిరంగ హెచ్చరికలు జారీ చేసింది. ఆదివారం బాటసింగారం మార్కెట్‌లో నిర్వహించిన ముఖ్య సభ్యుల సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర్ చారి మాట్లాడుతూ, గతంలో భారీ అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన రామ్ నర్సయ్య తమ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డిపై అనవసర ఆరోపణలు చేయడం తగదని స్పష్టం చేశారు. రామ్ నర్సయ్య గతంలో ఎలాంటి తీర్మానం లేకుండా దాదాపు 180 లైసెన్సులు జారీ చేసి కోట్ల రూపాయలు వసూలు చేశారని, ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణలో నిజాలు వెలుగులోకి రావడంతోనే ఆయనపై చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలు ప్రజలకు మాత్రమే కాకుండా రాజకీయ వర్గాలకూ తెలిసిన విషయాలేనని ఆయన అన్నారు. తమ చైర్మన్‌పై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని, లేకపోతే తగిన విధంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. మాజీ చైర్మన్ చేసిన అవినీతి కారణంగా మార్కెట్‌కు చెడ్డపేరు వచ్చిందని, ప్రస్తుత పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన తర్వాత మార్కెట్‌కు మంచి గుర్తింపు తీసుకొచ్చామని తెలిపారు. గతంలో నమోదైన అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులను కోరుతామని చెప్పారు. అవసరమైతే చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును మళ్లీ విచారణకు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు పన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్, మేకం లక్ష్మి, దోమలపల్లి అంజయ్య, రఘుపతి రెడ్డి, నవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా రిజర్వేషన్ లలో బిసిల వాటా తేల్చాలి

**దశ సూర్యాపేట ప్రతినిధి :** మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ గాని ఇండియా కూటమి గాని వ్యతిరేకం కాదని, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2023లోనే ఈ బిల్లు పాస్ అయిందని అయినప్పటికీ 2024 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి మహిళా రిజర్వేషన్ లు అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, కానీ బీసీ మహిళల కు కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారని, అందుకు బిజెపి ఒప్పుకోలేదని ఆయన అన్నారు. 30 ఏళ్ల నుంచి ఈ బిల్లు పెండింగ్ లో ఉందని, అప్పట్లో శరద్ యాదవ్, లల్లు ప్రసాద్ యాదవ్ ములాయం సింగ్ యాదవులు బీసీ మహిళలకు రిజర్వేషన్ లు ఇవ్వాలని బిల్లు కు అడ్డు చెప్పారని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని బిజెపి దుష్ప్రచారం చేస్తుందని ఆయన అన్నారు. బిసి మహిళకు రిజర్వేషన్ కల్పిస్తేనే తాము ఒప్పుకుంటామని 2023 లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధి తెలియజేశారని అన్నారు. ఇప్పుడు కొత్తగా బిజెపి ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టి కాంగ్రెస్ పై బురదజల్లే ప్రయత్నం చేస్తుందని, బిజెపికి చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్లలో బీసీల వాటా తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు బయ్య మల్లికార్జున్, హమీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

---



## ఘనంగా మాజీ మంత్రి పుట్టినరోజు వేడుకలు

**దశ, భద్రాచలం :** భద్రాచలం పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భద్రాచలం నియోజకవర్గ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేయడం చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండల కన్వీనర్లు కో కన్వీనర్లు అన్ని మండలాల సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి అవసరం

- *ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం*



**దశ, ఓయూ:** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో విశ్వవిద్యాలయ వికలాంగుల ఫోరం ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల చట్టం-2016 అమలు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడారు. వికలాంగుల హక్కుల చట్టం అమల్లోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయినా దివ్యాంగుల జీవితాల్లో ఆశించిన మార్పులు కనిపించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తే దివ్యాంగ విద్యార్థులకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సమాన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. చట్టసభల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించడం, అర్హత కలిగిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం, జైపాల్ రెడ్డి పేరుతో మిని విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాకు ఐదు కోట్లు నిధులు కేటాయించడం, ప్రైవేట్ రంగంలో శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించడం, షరతులు లేకుండా ఐదు లక్షల రూపాయల రుణాన్ని పూర్తి సబ్సిడీతో మంజూరు చేయడం, ప్రభుత్వ-ప్రైవేట్ రంగాల్లో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం, మొరిగాడి నరసింహ గౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు మొక్క ఉపేందర్, డాక్టర్ ఎన్ అశోక్, పరిశోధక విద్యార్థి పల్స ఆంజనేయులు గౌడ్, మారవేణి చంద్రశేఖర్ యాదవ్, బుచ్చి రాములు వేణు గౌడ్, ధనమ్మ, వెంకటేష్ జగన్, వెంకట్, రాజలక్ష్మి, గోలి ప్రభాకర్, మున్నా, వంశ రాజు, రామచందర్, మరుగుజ్జు సంఘం ఉపాధ్యక్షులు సైదులు, పంది శ్రీను, ఉదయ్యి టీమ్ సభ్యులు కోమరు మల్లు, పాండు యాదవ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.